ప్రజాశక్తి
సోమవారం 3 ఏప్రిల్ 2023
5
శ్రీకాకుళం



నేటి నుంచి ఒంటిపూట బడులు

టెక్కలి : జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు నేటి నుంచి ఈనెల 30వ తేదీ వరకు ఒంటి పూట తరగతులు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు నిర్వహించనున్నారు. పాఠశాల చివరి గంటలో మధ్యాహ్న భోజనం పెట్టనున్నారు. పదో తరగతి పరీక్షలు నిర్వహించే పాఠశాలల్లో పరీక్షలు జరిగే రోజు సెలవు ప్రకటించారు. అందుకు ప్రత్యామ్నాయంగా సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించాలని విద్యాశాఖ ఆదేశించింది. ఏటా మార్చి 15వ తేదీ నుంచి ఒంటి పూట బడులు నిర్వహించేవారు. కరోనా తర్వాత పాఠశాలల కేలండర్‌లో మార్పులు రావడంతో ఆ జిఒను పక్కనపెట్టారు. ఎండల తీవ్రత ఎక్కువ కావడంతో విద్యార్థుల ఇబ్బందుల దృష్ట్యా ఈనెల మూడో తేదీ నుంచి అమలు చేస్తున్నారు.

విజయీభవ

- నేటి నుంచి 'పది' పరీక్షలు
- 149 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- 29,575 మంది విద్యార్థులు హాజరు
- ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు పరీక్ష
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- విద్యార్థులకు ఆర్‌టిసిలో ఉచిత ప్రయాణం
- ఓపెన్ టెన్త్ పరీక్షలూ నేటి నుంచే...

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 18వ తేదీ వరకు జరుగనున్నాయి. పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్ష ప్రారంభ సమయానికి నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు. అత్యవసర పరిస్థితులు మినహా నిర్దేశించిన వేళల మధ్య పరీక్షా కేంద్రం నుంచి బయటకు అనుమతించరు. పదో తరగతి విద్యార్థులు హాల్ టిక్కెట్‌ను చూపిస్తే ఆర్‌టిసి బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే సౌకర్యాన్ని కల్పించారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం



కవిటి : బొరివంక పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న హెచ్‌ఎం రామకృష్ణ

జిల్లాలో పదో తరగతి పరీక్షలకు 29,575 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 28,855 మంది, ప్రయివేట్‌గా రాస్తున్నవారు 720 మంది ఉన్నారు. రెగ్యులర్ విద్యార్థుల్లో 14,770 మంది బాలురు, 14,085 మంది బాలికలు ఉన్నారు. ప్రయివేట్‌గా హాజరవుతున్న విద్యార్థుల్లో 456 మంది బాలురు, 264 మంది బాలికలు ఉన్నారు. పరీక్షల నిర్వహణకు 149 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో నాలుగు కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. ఈ కేంద్రాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. పరీక్షలకు నిమిషం నిబంధనను వర్తింపజేశారు. పరీక్ష సమయానికి నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోమని అధికారులు స్పష్టం చేశారు. నిర్ణీత సమయానికి 45 నిమిషాల ముందే చేరుకోవాలని సూచించారు.

పకడ్బందీగా పరీక్షలు

పరీక్షలను పకడ్బందీ నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నారు. 1334 మంది ఇన్విజిలేటర్లు, ఎనిమిది ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 70 సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించారు. పరీక్షా కేంద్రంలోకి సెల్‌ఫోన్లు, ల్యాప్‌ట్యాప్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకురాకూడదని అధికారులు సూచించారు. ఇన్విజిలేటర్లు కూడా సెల్‌ఫోన్లను పరీక్షా కేంద్రంలోకి తీసుకురావద్దని విద్యాశాఖ అధికారులు స్పష్టం చేశారు.

పశ్నాపత్రాలకు ఏడంకెల కోడ్

ప్రశ్నాపత్రం లీక్ ఘటనల నేపథ్యంలో ఈసారి ప్రశ్నాపత్రాలకు ఏడు అంకెల కోడ్‌ను అమలు చేస్తున్నారు. ఒకవేళ ప్రశ్నాపత్రం లీక్ అయితే ఏ పరీక్షా కేంద్రం నుంచి లీక్ అయిందో కూడా తెలుసుకునేలా ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి అవకతవకలు, మాస్ కాపీయింగ్‌కు వీల్లేకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారు. ప్రశ్నాపత్రాలను సమీపంలోని పోలీస్‌స్టేషన్ల నుంచి నిర్దేశించిన సమయానికి అరగంట ముందు మాత్రమే పోలీసు బందోబస్తు నడుమ పరీక్షా కేంద్రంలోకి తరలిస్తారు. పరీక్షల నిర్వహణలో పొరపాట్లు, అక్రమాలు జరిగితే సంబంధిత ఇన్విజిలేటర్లను విధుల నుంచి తప్పించనున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

పరీక్షలు రాసే విద్యార్థుల వివరాలు

యాజమాన్యం	రెగ్యులర్	ప్రయివేట్	మొత్తం
ఎపి మోడల్ స్కూల్స్	1249	0	1249
ఎపి రెసిడెన్షియల్ స్కూల్స్	159	0	159
ఎస్‌డబ్ల్యుఆర్ఇఐ స్కూల్స్	546	12	558
టిడబ్ల్యుఆర్ స్కూల్స్	68	0	68
ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు	2,584	112	2,696
జిటిడబ్ల్యుఎహెచ్	733	38	771
కెజిబివి	1000	16	1016
ఎపి బిసిడబ్ల్యుఆర్ స్కూల్స్	380	2	771
మున్సిపల్ హైస్కూల్స్	1173	46	1219
అన్ ఎయిడెడ్ స్కూల్స్	6,506	45	6,551
జెడ్‌పి ఉన్నత పాఠశాలలు	14,457	449	14,906
మొత్తం	**28,855**	**720**	**29,575**

పది పరీక్షల విధానంలో ప్రభుత్వం గతేడాది నుంచి మార్పులు తీసుకొచ్చింది. గతంలో హిందీ మినహా మిగిలిన ఐదు సబ్జెక్టులకు రెండేసి పేపర్లు ఉండేవి. దీంతో 11 పేపర్లు రాసే పరిస్థితి ఉండగా, గతేడాది ఏడు పేపర్లకు కుదించారు. సైన్స్ సబ్జెక్టుకు మాత్రమే రెండు పేపర్లలో పరీక్ష నిర్వహించారు. ఈ ఏడాది మాత్రం సైన్స్ పరీక్ష రోజున ఫిజికల్, బయోలాజికల్ సైన్స్‌కు వేర్వేరు పేపర్లను విద్యార్థులు రాయాల్సి ఉంటుంది.

ఆర్‌టిసిలో ఉచిత ప్రయాణం

పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ప్రభుత్వం ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. బస్ పాస్ లేకపోయినా ఒరిజినల్ హాల్ టిక్కెట్లను కండక్టర్‌కు చూపించి ఆర్‌టిసి బస్సులో పరీక్షా కేంద్రం వరకు ప్రయాణించవచ్చని ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్ కుమార్ తెలిపారు.

ఓపెన్ స్కూల్ విద్యార్థులకూ నేటి నుంచే...

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం నిర్వహిస్తున్న ఓపెన్ స్కూళ్ల విద్యార్థులకూ నేటి నుంచి టెన్త్, ఇంటర్ పరీక్షలు జరుగనున్నాయి. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు ఆరు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.



మాట్లాడుతున్న కూన రవికుమార్

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..?

- మంత్రులకు టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్ సవాల్
- సంక్షేమ పథకాలను ఎత్తివేసింది వైసిపి ప్రభుత్వమే

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అభివృద్ధి, సంక్షేమంపై టిడిపి ప్రభుత్వం ఐదేళ్లలో ప్రజలకు ఏం చేసిందో, వైసిపి ప్రభుత్వం ఏం చేసిందో బహిరంగ చర్చకు సిద్ధమా అని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ సవాల్ విసిరారు. ఆసరా సభల్లో మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు పచ్చి అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలకు తామేదో గొప్పగా చేస్తున్నామని నమ్మించడం కోసం సుదీర్ఘ రాజకీయ అనుభవం గల మంత్రి ధర్మాన ప్రసాదరావు మగవారిని పోరంబోకులు అనడం అతనిలో ఉన్న అభద్రతాభావాన్ని రుజువు చేస్తోందన్నారు. మగవారంతా అలాంటి వారైతే మిమ్మల్ని ఏమని భావించాలని ప్రశ్నించారు. సభల్లో చెప్తున్న లెక్కలు అభూతకల్పనగా ఉన్నాయన్నారు. మహిళలకు పొదుపుపై అవగాహన కల్పించి సంఘాలను ఏర్పాటు చేసి స్వయంశక్తి సంఘాల ద్వారా వారిని సాధికారిత వైపు నడిపించింది చంద్రబాబు అన్నది గుర్తు చేసుకోవాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో స్వయంశక్తి సంఘాలకు రూ.10వేల రుణమాఫీతో పాటు పసుపు కుంకుమ పేరుతో మరో రూ.10 వేలు ఆర్థికసాయాన్ని అందించిందన్నారు. వైసిపి ప్రభుత్వం అసరా పేరుతో ఎంత ఇచ్చిందో చెప్పాలన్నారు. గత ప్రభుత్వం మహిళలకు రూ.19,800 కోట్లు ఇస్తే, వైసిపి ప్రభుత్వం ఆసరాలో రూ.19 వేల కోట్లు మాత్రమే ఇచ్చిందన్నారు. పథకాల పేరు మార్చి ఎంతమంది విద్యార్థులకు సాయపడ్డారో చెప్పాలన్నారు. ఒక్క విద్యాశాఖ పరిధిలోనే 24 సంక్షేమ పథకాలను రద్దు చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందని విమర్శించారు. రాష్ట్రంలో ఈ నాలుగేళ్ల కాలంలో గత ప్రభుత్వాలు అమలు చేసిన 216 పథకాలను రద్దు చేశారని తెలిపారు. వాటికి ఇచ్చిన నిధులు మిగుల్చుకుని ప్రజలు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. పశుసంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజు టిడిపి హయాంలో సంక్షేమమే లేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన చూస్తున్న పశుసంవర్ధక శాఖలో మృతి చెందిన పశువులకు నాలుగేళ్లలో ఎంత పరిహారం ఇచ్చారో చెప్పగలరా అని అన్నారు. చంద్రన్న బీమా వల్ల ఎన్నో కుటుంబాలను టిడిపి ప్రభుత్వం ఆదుకుందని, అటువంటి పథకాన్ని కొనసాగించలేని ప్రభుత్వంలో ఉన్న మీరా మాట్లాడేది అని ధ్వజమెత్తారు. మంత్రి పదవి పోతుందన్న బాధ అప్పలరాజులో కనిపిస్తోందన్నారు. దాన్ని నిలబెట్టుకునే ప్రయత్నంలో రెట్టింపు అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని, దీన్ని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు సింతు సుధాకర్, పి.ఎం.జె బాబు, టి.వెంకన్న యాదవ్, ప్రదాన విజయరాం, విభూది సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - రణస్థలం

మహిళా సాధికారతే ప్రధాన ధ్యేయమని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఆసరా మూడో విడత కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం పథకాల అమలును సాధ్యం చేస్తున్నామని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటికే మూడు విడతలు చెల్లించామని, ఇంకా ఒక్క విడత మాత్రమే చెల్లించాల్సి ఉందన్నారు. మహిళా సంఘాలు చేసిన అప్పులు, రైతాంగం చేసిన అప్పులు తీర్చేస్తామని చంద్రబాబు నమ్మబలికారని, అధికారంలోకి వచ్చాక తన వారికి, తన అనుకున్న వారికి పప్పు బెల్లాల్లా పంచి పెట్టారని చెప్పారు. ఇచ్చిన మాట మాత్రం నిలబెట్టుకోలేకపోయారని విమర్శించారు. మహిళలను శక్తివంతులుగా చేస్తున్న వైసిపి ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు. ఎచ్చెర్ల నియోజకవర్గానికి ఆసరా కింద మూడో విడతగా రూ.59 కోట్లు అందిస్తున్నామని తెలిపారు.

ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ మాట్లాడుతూ పరిపాలనా వికేంద్రీకరణ ద్వారా ప్రజల వద్దకే పాలన తీసుకు వచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిదేనన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందడం టిడిపి నాయకులకు ఇష్టం లేదని, అందుకే విశాఖ కేంద్రంగా రాజధాని ఏర్పాటుకు వ్యతిరేకంగా ఉన్నారని విమర్శించారు. అనంతరం డ్వాక్రా మహిళలకు నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, కార్పొరేషన్ల పేరాడ తిలక్, మామిడి శ్రీకాంత్, బల్లాడ హేమమాలిని రెడ్డి, పిన్నింటి సాయికుమార్, ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ ప్రతినిధి ఎల్.ప్రసాద్, రణస్థలం, జి.సిగడాం మండలం ఎంపిపిలు పిన్నింటి రజని, మీసాల వెంకటరమణ, జెడ్‌పిటిసిలు టొంపల సీతారాం, కాయల రమణ తదితరులు పాల్గొన్నారు.



నమూనా చెక్కును అందజేస్తున్న మంత్రి ధర్మాన తదితరులు



చెక్కును పంపిణీ చేస్తున్న సీదిరి అప్పలరాజు

కెటి రోడ్డు పూర్తి చేసి కానుకగా ఇస్తా

మంత్రి సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి - పలాస

కెటి రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసి పలాస, కాశీబుగ్గ మున్సిపాలిటీకి కానుకగా ఇస్తానని రాష్ట్ర మత్స్య, పశు సంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. కాశీబుగ్గ సంత మైదానంలో వైఎస్‌ఆర్ ఆసరా మూడో విడత చెక్కును డ్వాక్రా మహిళలకు ఆయన పంపిణీ చేశారు. ముందుగా వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాలేసి, నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడారు. వైసిపి అధికారం చేపట్టినప్పటి నుంచి పలాసలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, త్వరలో రైల్వే వంతెన పూర్తి చేస్తామని చెప్పారు. బాబు అధికారంలోకి వస్తే వైసిపి పథకాలు నిలిపివేస్తారని అన్నారు. వైఎస్‌ఆర్ ఆసరా కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు హాజరు కాలేదు. దీంతో గిరిబాబు ఆధ్వర్యాన నిర్వహించాల్సిన కార్యక్రమాన్ని బల్ల శ్రీను అధ్యక్షతన నిర్వహించారు. దీన్ని వైసిపి నాయకులు తప్పుపట్టారు. వైసిపి జెండాలతో మెప్మా మహిళలు ఆసరా కార్యక్రమంలో నృత్యాలు చేయడం చర్చనీయాంశమైంది. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, బి.కృష్ణారావు, పలాస ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డి.భవానిశంకర్, బి.బల్లయ్య, హెచ్.వెంకటరావు, కోత పూర్ణ చంద్రరావు, దుర్గాశంకర్ పండా, మహిళలు,తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులుగా రవీంద్ర, మోహనరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



రవీంద్ర



మోహనరావు

రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ సంఘం (యుటిఎఫ్) రాష్ట్ర కార్యదర్శిగా చౌదరి రవీంద్ర వరుసగా మూడోసారి ఎన్నికయ్యారు. విజయవాడలో నిర్వహించిన 48వ రాష్ట్ర కౌన్సిల్‌లో జరిగిన ఎన్నికల్లో ఆయనతో పాటు యుటిఎఫ్ జిల్లా పూర్వ అధ్యక్షులు రెడ్డి మోహనరావును కార్యదర్శిగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పొందూరు అప్పారావు, ఎస్.కిషోర్ కుమార్, ఆర్.దమయంతి, వై.ఉమాశంకర్ ఎన్నికయ్యారు.

నూతన విద్యా విధానంతో తిరోగమనం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నూతన జాతీయ విద్యా విధానంతో విద్యా వ్యవస్థ తిరోగమన బాట పట్టనుందని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టియు) రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పేడాడ ప్రభాకరరావు విమర్శించారు. నగరంలోని క్రాంతి భవన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో విద్యాశాఖ ఉన్నతాధికారులకు, దిగువ స్థాయి అధికారుల మధ్య సమన్వయం కొరవడుతోందన్నారు. అసంబద్ధ ఉత్తర్వుల వల్ల ఉపాధ్యాయులు భయాందోళనలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. షోకాజ్‌ల పేరుతో ఒక్క నిమిషం ఆలస్యమైనా ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటున్న ఉన్నతాధికారులు పరోక్షంగా ఉపాధ్యాయుల మరణాలకు కారణమవుతున్నారన్నారు. 12వ పిఆర్‌సిపై ఇంతవరకు ఎటువంటి నియమ నిబంధనలను ప్రభుత్వం ప్రకటించలేదన్నారు. దీనివల్ల ఉద్యోగుల్లో ప్రభుత్వంపై ఆందోళన వ్యక్తమవుతోందన్నారు. పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే ఇన్విజిలేటర్లకు గౌరవ వేతనాన్ని రూ.20 మాత్రమే చెల్లిస్తున్నారని చెప్పారు. మరోవైపు స్పాట్ వాల్యుయేషన్‌లోనూ వసతులు కల్పించడంలో ఏటా సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. ఈ సమస్యలపై ప్రభుత్వం దృష్టిసారించాలని కోరారు. సమావేశంలో సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.తమ్మినాయుడు, ఎస్.వి రమణ, ఈశ్వరరావు, తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభాకరరావు

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ టి.శ్రీనివాస ప్రసాద్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్





వేసవిలో తాగునీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు అన్ని రకాల చర్యలు చేపడతున్నట్లు గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎస్ఇ టి.శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. గిరిజన ప్రాంతాలు, తీర ప్రాంత గ్రామాల్లో నీటి ఎద్దడి తీవ్రత అధికంగా ఉందని, ఏటా ఈ సమస్య ఎదురవుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. జిల్లాలో నీటి ఎద్దడి నివారణకు తీసుకుంటున్న చర్యలు, ఉద్దానం మంచినీటి ప్రాజెక్టు లక్ష్యం, జలజీవన్ మిషన్ కార్యాచరణ, తదితర విషయాలను ఆయన ప్రజాశక్తి ముఖాముఖిలో వివరించారు.

జిల్లాలో నీటి ఎద్దడి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

గత ఏడాది ఆలస్యంగా కురిసిన వర్షాల వల్ల భూగర్భజలాలు కొంత మెరుగ్గానే ఉన్నాయి. అయితే ఏజెన్సీ మండలాల్లో తాగునీటి ఎద్దడి వేసవిలో కొంత మేరకు ఎదురవుతుంది. ఈ ఏడాది భూగర్భజలాల ఆధారంగా నీటి ఎద్దడి తీవ్రతను అంచనా వేస్తున్నాం. ఆ దిశగా గ్రామాలను గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం. గ్రామాల్లో ఉన్న పాత స్కీంలను అత్యవసరంగా మరమ్మతు పనులు చేపట్టడం జరుగుతోంది. మరోవైపు బోర్లు మరమ్మతు పనులు చేపడుతున్నాం. జల జీవన్ పథకం ద్వారా ప్రజల తాగునీటి అవసరాలను తీర్చడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా గ్రామాల వారీగా నివశిస్తున్న ప్రజలు, వారికి అవసరమవుతున్న నీటి నిల్వలపై సమగ్ర నివేదికలను సిద్ధం చేస్తున్నారు.

ఉద్దానం మంచినీటి పథకం ఏ దశలో ఉంది?

జిల్లాలో అత్యధిక మండలాల్లో తాగునీటి అవసరాలు తీర్చడానికి వీలుగా ప్రభుత్వం రూ.700 కోట్లతో ఉద్దానం మంచినీటి పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు నిర్మాణ దశలో ఉంది. వంశధార నది నీటిని తాగునీటి అవసరాల కోసం వినియోగించుకునేందుకు ఈ ప్రాజెక్టు రూపకల్పన జరిగింది. హిరమండలం రిజర్వాయర్ వద్ద ఇంటేక్ వెల్ నిర్మించి అక్కడ నుంచి పైపులైను ద్వారా వజ్రపుకొత్తూరు మండలంలో 121 గ్రామాలు, పలాసలో 86 గ్రామాలు, మందసలో 225 గ్రామాలు, సోంపేటలో 74 గ్రామాలు, కవిటిలో 118 గ్రామాలు, కంచిలిలో 138 గ్రామాలు, ఇచ్ఛాపురంలో 45 గ్రామాలకు తాగునీరు అందించేందుకు ప్రాజెక్టు రూపకల్పన జరిగింది. రెండు నియోజకవర్గాల్లోని ఏడు మండలాల పరిధిలో 807 గ్రామాలకు తాగునీటి అవసరాలు తీర్చనుంది. ఈ గ్రామాల్లో సుమారు 4.69 లక్షల మంది జీవిస్తున్నారు. వారికి 2051 వరకు నిరాటంకంగా నీటిని అందించవచ్చు.

ఉద్దానం మంచినీటి ప్రాజెక్టు ద్వారా ఎన్ని టిఎంసిల నీటిని సరఫరా చేయనున్నారు?

ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయిన తర్వాత ఏడాదికి 1.12 టిఎంసిల నీరు ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు ఉపయోగించుకోవచ్చు. నీటి సరఫరాకు వీలుగా 16 ప్రదేశాల్లో ఓవర్ హెడ్ బేలన్సింగ్ రిజర్వాయర్లు, 23 ప్రదేశాల్లో గ్రౌండ్ లెవెల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు నిర్మించడం జరుగుతోంది. మెళియాపుట్టి మండలం మాకన్నపురం, పలాస మండలం టెక్కలిపట్నం వద్ద హెడ్ వర్కులను ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం 1062 కిలోమీటర్ల మేర పైపు లైన్లు వేసేందుకు, 51 సంపులు నిర్మాణం జరుగుతోంది. ఈ పనులు పూర్తయితే జిల్లాలో అత్యధిక భాగం తీగునీటి ఎద్దడితో పాటు, కిడ్నీ వ్యాధి విస్తరించకుండా ఉండేందుకు దోహదపడుతుంది.

ప్రస్తుతం పనులు ఏ మేరకు పూర్తి చేశారు?

ఈ ఏడాది ఆగస్టు నాటికి ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు నీరదించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అందులో భాగంగానే అత్యంత ప్రాధాన్యత గల ప్రాజెక్టుగా దీన్ని చేపట్టారు. కానీ పనులు మొదలు కావడం కొంత ఆలస్యమైంది. దీంతో ఇప్పటికి దాదాపు 80శాతం పనులు పూర్తయ్యాయి. మొత్తం 264 పెద్ద ట్యాంకులు నిర్మించాల్సి ఉండగా 210 చివరి దశలో ఉన్నాయి. వాటికి పైపులైన్లు అనుసందిస్తున్నాం. మిగిలిన 54 ట్యాంకుల నిర్మాణం పూర్తయింది. ప్రధాన పైపులైను 350 కిలోమీటర్లకు ఇప్పటికే దాదాపు 80శాతం పనులు పూర్తి చేయడం జరిగింది. డిస్ట్రిబ్యూటరీ లైన్లు 650 కిలోమీటర్ల శతశాతం పూర్తి చేయడం జరుగుతోంది. ఈ పనులు పూర్తి చేసిన తర్వాత ప్రతి గ్రామానికీ తాగునీరు అందించేందుకు చర్యలు మొదలు కానున్నాయి.

జల జీవన్ మిషన్ కార్యాచరణ ఎలా సాగుతోంది?

గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంకులు ఉండి, కుళాయి కనెక్షన్ ఇచ్చే అవకాశం ఉన్న ప్రాంతాల్లో పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇవ్వాలన్నదే ఈ మిషన్ లక్ష్యం. ప్రతి సహాయ ఇంజినీరు నెలకు రూ.10 కోట్ల పనులు పూర్తి చేయాలని నిర్దేశించడం జరిగింది. ఈ పథకం ద్వారా ప్రభుత్వ సంస్థలకు కుళాయి కనెక్షన్ ఇస్తున్నాం. జల జీవన్ మిషన్ ద్వారా 2024 నాటికి ప్రతి గృహానికి కుళాయి కనెక్షన్ ఇవ్వడమే లక్ష్యం. గ్రామ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి పనులు శరవేగంగా పూర్తి చేస్తున్నాం.

జగనన్న కాలనీల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

జగనన్న ఇళ్ల కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. నిర్మాణ పనులతో పాటు కాలనీల్లో రానున్న రోజుల్లో నీటి ఎద్దడి లేకుండా చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఈ దిశగా కాలనీల్లో శాశ్వత ప్రాతిపదికన తాగునీటి సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాం. అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా అత్యంత ప్రాధాన్యత తాగునీటి సరఫరాకు ఇస్తున్నాం.

త్వరలో ఇండస్ట్రియల్ పార్కు

మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి - పలాస



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలకు ఎంతో అవసరమైన కొత్త ఇండస్ట్రీ పార్కు నిర్మాణ పనులు అతి త్వరలో ప్రారంభించబోతున్నట్లు రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు తెలిపారు. పలాస ప్రగతి భవనంలో ఆదివారం ఎపిఐఐసి జోనల్ మేనేజర్ యతిరాజులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండస్ట్రియల్ పార్క్ కోసం భూమి మంజూరు చేయడం జరిగిందని, దాన్ని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు తొందరలోనే కేటాయించేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. ఇండస్ట్రియల్ పార్కుకు సంబంధించి విధివిధానాలు, ఏ విధంగా దాన్ని కేటాయించాలనే విషయంపై అధికారులతో సమీక్షించినట్లు చెప్పారు. సమావేశంలో ఎపిఐఐసి జోనల్ మేనేజర్ యతిరాజులు, మేనేజర్ రామకృష్ణ, ఎఎంసి చైర్మన్ పివి.సతీష్‌కుమార్, పలాస క్యాష్యు మానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ సభ్యులు మళ్లా సురేష్, కె.వి.శివకృష్ణ, పి.రవికాంత్, ఇండస్ట్రియల్ ఎస్టేట్ సభ్యులు ఎం.రామేశ్వరరావు, సుధాకర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


అచ్చెన్నాయుడును కలిసిన టిడిపి నాయకులు

వైసిపిని ఓడించేందుకు సిద్ధంగా ఉండాలి

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైసిపిని ఓడించేందుకు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు సిద్ధంగా ఉండాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆదివారం నిమ్మాడలోని తన స్వగృహంలో అచ్చెన్నను టిడిపి శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం మరో ఆరు నెలల్లో ఎన్నికలకు సిద్ధం అవుతోందని, మనమంతా ఆ ఎన్నికల్లో వైసిపిని ఓడించాలని ఆయన కోరారు. అచ్చెన్నను కలిసిన వారిలో టెక్కలి మండలం తొలుసూరిపల్లి, సంతబొమ్మాళి మండలం కోటపాడు, కాశీపురం, వడ్డితాండ్ర, నందిగాం మండలం బడగాం, కాశీపురం, కోటబొమ్మాళి మండలం హరిశ్చంద్రపురం, కోటబొమ్మాళి గ్రామాలకు చెందిన వారు ఉన్నారు.


చీరను అందజేస్తున్న అప్పలనాయుడు దంపతులు

అమరావతి రైతులకు సన్మానం

రణస్థలం రూరల్: అమరావతి రైతులు అమరావతి నుంచి అరసవిల్లి వరకు పాదయాత్ర నిర్వహించి ఆదివారం సూర్యనారాయణస్వామిని దర్శించుకున్నారు. ఈ మేరకు తిరుగు ప్రయాణంలో పాత పోలీస్ స్టేషన్ వద్ద టిడిపి నాయకులు, పొందూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కలిశెట్టి అప్పలనాయుడు, ఆయన సతీమని ప్రభ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అనంతరం 150 మంది రైతులకు ఖాదీ వస్త్రాలతో, మహిళా రైతులకు చీరలు, పసుపు కుంకుమ ఇచ్చి ఘనంగా మర్యాదలు చేసి సత్కరించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల భవిష్యత్, ప్రయోజనాల కోసం అమరావతి రాజధాని నిర్మాణానికి 34 వేల ఎకరాల భూములను త్యాగం చేశామని అన్నారు. ఏకైక రాజధాని అమరావతే కావాలని కోరుతూ తలపెట్టిన అమరావతి నుంచి అరసవెల్లి పాదయాత్ర దిగ్విజయంగా పూర్తి చేసుకున్నామని అన్నారు. రానున్న కాలంలో అమరావతి అజరామరంగా ఆంధ్రాకు ఏకైక రాజధానిగా వెలుగొందడం ఖాయమని అన్నారు.

ఐదు కేంద్రాల్లో 'పది' పరీక్షలు

మెళియాపుట్టి : మండలంలో పదో తరగతి పరీక్షలు ఐదు కేంద్రాల్లో నిర్వహిస్తున్నామని, మండలంలోని 20 పాఠశాలల్లో చదువుతున్న 986 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు ఎంఇఒ ఎస్.దేవేందరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దమడిలో బాలికల ఆశ్రమ పాఠశాల, బందపల్లిలో గిరిజన ఆశ్రమ పాఠశాల, మెళియాపుట్టి, చాపర, గొప్పిలి ఉన్నత పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలు అధికారులు ఆదివారం సిద్ధం చేశారని అన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్దా 144 సెక్షన్ అమలు చేశామని తెలిపారు.

సాహితీ బ్రహ్మోత్సవాలకు ప్రపంచస్థాయిలో గుర్తింపు రావాలి

రెవెన్యూ మంత్రి ధర్మాన, ఎంపీ చంద్రశేఖర్

ప్రజాశక్తి- రణస్థలం

శ్రీశ్రీ కళావేదిక, ఇంద్రాణి ఛారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యాన ఈ నెల 9,10,11 తేదీల్లో తిరుపతిలో నిర్వహిస్తున్న సాహితీ బ్రహ్మోత్సవాలకు ప్రపంచస్థాయి గుర్తింపు రావాలని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అభిలషించారు. రణస్థలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సాహితీ బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధర్మాన మాట్లాడుతూ మహిళా పోలీసుగా విధులు నిర్వర్తిస్తూ... సాహిత్యంపై మక్కువతో రచనలు చేస్తున్న శ్రీశ్రీకళావేదిక జాతీయ మీడియా ప్రతినిధి అమ్మోజి బమ్మిడిని కొనియాడారు. మహిళలు అన్నిరంగాల్లో రాణించడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్ రచించిన రెండు పుస్తకాలను ఆవిష్కరించానని, సమాజహితమైన రచనలు చేస్తున్నారని అన్నారు. ఎంపీ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఉన్న 2000 మందిని ఒకే వేదికపైకి తీసుకొచ్చి కళా ప్రదర్శన చేయడం, వారిని సత్కరించడం గొప్ప విషయం అన్నారు. ప్రోగ్రాం కన్వీనర్, శ్రీశ్రీ కళావేదిక అధికార ప్రతినిధి గుత్తా హరి సర్వోత్తమనాయుడు, కో-ఆర్డినేటర్ కొల్లి రమావతి, మహిళా అధ్యక్షులు చిట్టె సిద్ధ లలిత సేవలను ప్రశంసించారు. సాహిత్యం రంగంలో రాణిస్తున్న శ్రీశ్రీ కళావేదిక కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయడం మంచి విషయమన్నారు. కార్యక్రమంలో ఎంపిపి పిన్నింటి రజని, ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జెడ్‌పిటిసి టి.సీతారాం, ఎంపిడిఒ ధనుంజయరావు, ఎస్ఐ జి.రాజేష్ సచివాలయ ఉద్యోగులు రామునాయుడు, రాజీనాయుడు, శంకరరావు, గణపతి పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ చేసుకున్న వారందరికీ ఆహ్వానం

సంస్థ జాతీయ మీడియా ప్రతినిధి అమ్మోజి బమ్మిడి మాట్లాడుతూ తిరుపతిలో ఈ నెల 9 నుంచి నిర్వహిస్తున్న సాహితీ బ్రహ్మోత్సవాలకు 2000 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని అన్నారు. వీరందరికీ కో-ఆర్డినేటర్లు ఆహ్వానపత్రాలు పంపించారని తెలిపారు. ఏదైనా కారణం వల్ల ఆహ్వాన పత్రం అందకపోయినా రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతిఒక్కరూ తమ కలను ప్రదర్శించవచ్చని అన్నారు. పాల్గొన్నవారికి ఎటువంటి ఇబ్బంది కలుగకుండా సమయం కేటాయించమన్నారు. అందరికీ ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరికీ ముఖ్య అతిథుల చేతుల మీదుగా సన్మానం చేస్తామని తెలిపారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు, అధికారులు

పనులు చేయకుండా బిల్లు ఎలా చెల్లించారు

ఆర్అండ్‌బి అధికారులపై ఎంపిపి రాజేశ్వరి ఆగ్రహం

సంతబొమ్మాళి: ఉమిలాడ నుండి వన్‌విష్ణుపురం వరకు జంగిల్ క్లియరెన్స్ చేయకుండా రూ.1.40 లక్షలు బిల్లులు ఎలా చెల్లించారని ఎంపిపి మేరుగు రాజేశ్వరి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పని జరగకుండా కోటబొమ్మాళి ఆర్అండ్‌బి జెఇ సరోజా ఏ విధంగా బిల్లులు చెల్లించారని ఎఇ సతీష్‌ను ఎంపిపి నిలదీశారు. సతీష్ మాట్లాడుతూ వివరాలు కొనుక్కొని చెప్తానని అన్నారు. సంతబొమ్మాళి పిహెచ్‌సి వైద్యుడు సమయ పాలన పాటించడం లేదని, సకాలంలో సమావేశాలకు హాజరు కావడం లేదని ఎంపిటిసి దూబ లక్ష్మి, సర్పంచ్ కె.లక్ష్మి సమావేశం దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ కార్యక్రమాలు స్థానిక ప్రజాప్రతినిధులకు చెప్పాల్సిన బాధ్యత అంగన్వాడీలకు లేదా అని ఐసిడిఎస్ పిఒ శోభారాణిని సభ్యులు నిలదీశారు. ఇళ్ల బిల్లుల చెల్లింపుల్లో జాప్యం లేకుండా చూడాలని జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి అన్నారు. బోరుభద్ర జెడ్‌పి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం అధ్వానంగా ఉందని ఎంఇఒ చిన్నవాడు దృష్టికి సభ్యులు తీసుకొచ్చారు. ఎం.సున్నాపల్లి పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే ఆదనపు భవనాల మంజూరు చేయాలని పాలవసంతరెడ్డి, వైస్ ఎంపిపి నక్క చింతామణి కోరారు. ఉన్నతాధికారులకు చెప్పామని ఎంఇఒ బదులిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పి.తులసమ్మ, తహశీల్దార్ చలమయ్య, ఎంపిడిఒ జి.ఉమాసుందరి, ఎఒ జి.శ్రీలక్ష్మి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.


ఎంఇఒతో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి వసంతరెడ్డి

ధర్మాన వ్యాఖ్యల్లో అభద్రతాభావం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆసరా పేరిట నియోజకవర్గం పరిధిలో నిర్వహిస్తున్న సభల్లో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు మాటల్లో అభద్రతాభావం వ్యక్తమవుతోందని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ వ్యాఖ్యానించారు. అరసవల్లిలోని తన నివాసంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. శనివారం నగరంలోని హడ్కో కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మహిళలతో మాట్లాడుతున్న సమయంలో గేట్లు వేశాం కాబట్టి మీలో ఎవరూ గోడ దూకలేదని, లేకపోతే ఇక్కడ పిట్టకూడా ఉండరని చెప్పడం ఆయనలోని భయానికి నిదర్శనమన్నారు. మహిళలు పాల్గొన్న సభల్లో వారి భర్తల గురించి, మగవాళ్లపై ఆయన చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయన్నారు. మగవారిని పోరంబోకులు అనడంతో పాటు కొంగున డబ్బులు ఉంటేనే మీ వెంట మొగుడు అని మాట్లాడడం సరికాదన్నారు. ఇటువంటి వ్యాఖ్యల వల్ల ఆలుమగల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి ఓట్లు సాధించాలని ధర్మాన భావించడం సరికాదన్నారు.


అప్పలసూర్యనారాయణ

జాబ్ కేలండర్ ఊసేది?

కొత్తూరు : ఏటా జనవరి 1న జాబ్ కేలెండర్ విడుదల చేస్తామన్న సిఎం జగన్మోహన్‌రెడ్డి నాలుగేళ్లు గడుస్తున్నా ఆఊసే లేదని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ అన్నారు. మండలంలోని మతలలో తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో పరిశ్రమలు రాకపోవడంతో యువతకు ఉద్యోగ అవకాశాలు లేకుండాపోయాయని అన్నారు. ఏటా డిఎస్‌సి నోటిఫికేషన్ వేస్తామని ప్రభుత్వం ఆ ఊసే లేదని అన్నారు. పెట్టుబడులు పెట్టడం అంటే చేపల మార్కెట్, మాసం దుకాణాలు ప్రారంభించడం కాదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో జాబ్ కావాలంటే చంద్రబాబు సిఎం కావాలని అన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం

ఇచ్ఛాపురం: పట్టణంలోని ఆంధ్రా బాపిస్ట్ చర్చి అధ్వర్యంలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. గొల్లవీధిలో ఉన్న చర్చి నుంచి పట్టణ పుర వీధుల్లో క్రీస్తు కీర్తనలుల పాడుతూ భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చర్చి అధ్యక్షులు పి.విజయకుమార్, కార్యదర్శి తాతాజీబాబు, వజ్రపు వెంకటేష్, జిల్లా క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షులు ప్రత్తి అన్వేష్, పాస్టర్ అర్‌వి ప్రదీప్‌కుమార్, జోష్‌కుమార్, వీర కుమార్ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: ఆంధ్రా బాపిస్టు చర్చి ఆధ్వర్యాన మట్టల ఆదివారం నిర్వహించారు. ఉదయం 6గంటల నుంచి క్రీస్తు సంకీర్తనలతో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో పాస్టర్ రెవ కె.జాషువ, క్రిస్టియన్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం: ర్యాలీ నిర్వహిస్తున్న క్రిస్టియన్లు


సమావేశంలో మాట్లాడుతున్న ఓంకార్

గణితం జీవితంలో భాగం

ప్రజాశక్తి- పలాస

విద్యార్థులు ఆట, పాటలతో పాటు చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలని, చదువులో మెలకువలు నేర్చుకోవాలని ఉద్దాన విద్య అభివృద్ధి వేదిక గౌరవాధ్యక్షులు బత్తిని ఓంకార్ సూచించారు. మండలంలోని నీలావతి గ్రామంలో ఉద్దాన విద్య అభివృద్ధి వేదిక ఆధ్వర్యాన విద్యార్థులకు గణిత ప్రాథమిక అంశాలపై ప్రత్యేక అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణితంలో మెలకువలు తప్పనిసరిగా తెలుసుకోవాలన్నారు. ప్రతి మనిషి జీవితంలో గణితం ఓ భాగమని, దాన్ని విద్యార్థులు గమనించాలన్నారు. అనంతరం గణితంపై సిహెచ్ హేమంబారావు మాస్టారు, నాగేశ్వరరావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యువివి ప్రధాన కార్యదర్శి బొడ్డు చిన్నారావు, లైబ్రరీయన్ గీతాంజలి పాల్గొన్నారు.


జ్ఞాపికను అందుకుంటున్న అట్టాడ సిరి

ఆదిత్యుని సన్నిధిలో ప్రముఖులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని పలువురు ప్రముఖులు ఆదివారం దర్శించుకున్నారు. విజయనగరం జిల్లా నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అలాగే గిరిజన కార్పొరేటివ్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేష్ కుమార్, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ కమిషనర్ అట్టాడ సిరిలు దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆలయ మర్యాదలతో స్వాగతించారు. ఆలయంలో స్వామివారికి నిర్వహించిన పలు సేవల్లో పాల్గొన్న అనంతరం ప్రాంగణంలోని అనివేటి మండపంలో వారికి స్వామి వారి శేషవస్త్రాలను కప్పి జ్ఞాపికలను ఆలయ ఇఒ వి.హరి సూర్యప్రకాష్ అందేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వైసిపి పట్టణాధ్యక్షులుగా సింహాచలం

పలాస: వైసిపి పట్టణ అధ్యక్షులుగా సనపల సింహాచలంను మంత్రి సీదిరి అప్పలరాజు ఆదివారం నియమించారు. ఈయనతో పాటు మున్సిపాలిటీ సచివాలయం కన్వీనర్‌గా బడగల బాలచంద్రుడు, వైసిపి పట్టణ అధికార ప్రతినిధిగా శిష్టి గోపి, గుజ్జు జోగారావును ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సంత మైదానంలో ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేసేలా చూడాలని సూచించారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ఆమదాలవలస : సమాజ అభివృద్ధికి ప్రతిఒక్కరూ పాటుపడాలని సమాచార హక్కు చట్టం రక్షణ వేదిక జిల్లా ఉపాధ్యక్షులు దుగ్గివలస రాంప్రసాద్ అన్నారు. మండలంలోని చిట్టివలసలో ప్రత్యేక సేవా శిబిరాన్ని జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్ జె.కె.రవిబాబు ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించారు. ఇందులో భాగంగా సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థలకు సంబంధించిన సమాచారం పొందేందుకు సమాచార హక్కు చట్టం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. రోటరీ క్లబ్ సెక్రటరీ పల్లె తేజలక్ష్మి మాట్లాడుతూ సాధికారిక అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించి వాలంటీర్లకు చర్చా వేదిక నిర్వహించామని అన్నారు. ప్రతి నిర్ణయంలోనూ మహిళలకు సమానమైన స్థితిని కలిగించాలన్నారు. కార్యక్రమంలో వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాంప్రసాద్

విశ్రాంత రెవెన్యూ ఉద్యోగుల భవనం ప్రారంభం


ధర్మానకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని పాత శ్రీకాకుళంలో ఉన్న విలేజి చావిడిలో విశ్రాంత రెవెన్యూ ఉద్యోగుల సంఘం భవనాన్ని నిర్మించారు. ఈ భవనాన్ని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం రెవెన్యూ చట్టాల్లో విప్లవాత్మకమైన మార్పులు తెస్తున్నట్టు తెలిపారు. దీనివల్ల భూ వివాదాలు తగ్గుతాయన్నారు. రెవెన్యూ ఉద్యోగుల సంఘం విశ్రాంత అధ్యక్షులు పొట్నూరు రజనీకాంతరావు మాట్లాడుతూ విశ్రాంత రెవెన్యూ ఉద్యోగుల అవసరాలను తీర్చేందుకు వీలుగా సొంత భవనాన్ని సంఘానికి ఏర్పాటు చేసేందుకు ధర్మాన, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ సహకరించారని అన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాన్ని మరమ్మతులు చేపట్టేందుకు విశ్రాంత రెవిన్యూ ఉద్యోగులు సుమారు రూ.3.50 లక్షలు వెచ్చించి పునర్నిర్మాణం చేశామన్నారు. కార్యక్రమంలో విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులు ఎం.సీతారామ్మూర్తి, పి.ఎం.జె.బాబు, ఆర్.మోహనరావు, డి.పి.దేవ్, రెవెన్యూ సర్వీసుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పప్పల వేణుగోపాల్, ఎన్‌జిఒ రాష్ట్ర సహాధ్యక్షులు చౌదరి పురుషోత్తంనాయుడు, జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం పాల్గొన్నారు.

భూ కబ్జా చేసినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తా

ప్రజాశక్తి- పలాస

మండలంలోని రామకృష్ణాపురం సర్వే నంబరు 143లో రెండు ఎకరాలు భూకబ్జాకు పాల్పడినట్లు రాష్ట్ర మత్స్య, పశు సంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ఇటీవల పలాసలో నిర్వహించిన స్పందనలో ఆరోపించారని, తాను కబ్జాకు పాల్పడినట్లు నిరూపిస్తే టిడిపి మండల అధ్యక్ష పదవికి, గురుదాసుపురం సర్పంచ్ పదవికి రాజీనామాలు చేస్తామని కుత్తుం లక్ష్మణ్‌కుమార్, రూపావతి మంత్రికి సవాల్ విసిరారు. రామకృష్ణాపురం వద్ద ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2018 ఏడాదిలో రామకృష్ణాపురం గ్రామానికి చెందిన ఎ.వెంకటరమణ వద్ద రెండు ఎకరాలు జిరాయతీ స్థలాన్ని కొనుగోలు చేసి ప్లాటులు వేసి అమ్మకం చేశానని, తాను ఎవరి భూమి ఆక్రమించుకోలేదని చెప్పారు. 2021 అక్టోబర్‌లో ఇచ్ఛాపురం నియోజకవర్గం ఈదుపురం గ్రామానికి చెందిన నర్తు నరేంద్ర రామకృష్ణాపురం స్థలం వద్దకు వచ్చి గొడవకు పాల్పడుతున్నారని చెప్పారు. ఆ సమయంలోనే మంత్రి అప్పలరాజు అనుచరుడు తనకు ఫోన్‌లో బెదిరించారని, వైసిపిలో చేరితే స్థలం గొడవను పరిష్కారం చేస్తామని చెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. నా వద్ద ఆ ఫోన్‌కు సంబంధించి అన్ని ఆధారాలూ ఉన్నాయని, ఎవరు బెదిరించిన భయపడే పరిస్థితి లేదన్నారు. అవసరమైతే నా సొంత స్థలాలను నా వద్ద కొనుగోలు చేసిన వ్యక్తులకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.


మాట్లాడుతున్న లక్ష్మణ్ కుమార్

అక్రమ క్వారీ ఘటనపై నిగ్గు తేల్చాలి

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని వి.ఆర్.గూడెంలో ఉన్న అక్రమ గ్రావెల్ క్వారీ నిర్వహణలో జరిగిన సంఘటనపై మైనింగ్, పోలీసులు, రెవెన్యూ అదికారులు సమగ్ర దర్యాప్తు చేపట్టి నిగ్గు తేల్చాలని జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్ డిమాండ్ చేశారు. పొందూరులోని వైసిపి కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అక్రమంగా క్వారీ తవ్వకాలు జరపడంతో విద్యార్థి బగాది మణికంఠను బలితీసుకుందని అన్నారు. ఈ సంఘటన ప్రమాదం కాదని, ఇది హత్యగా మేము అనుమానిస్తున్నామని ఆరోపించారు. కొందరిపైనే మాత్రమే కేసు నమోదు చేశారని, కానీ, ఈ ఉదంతం టిడిపి పెద్దలు చేసిన పనిగా భావిస్తున్నామని అన్నారు. ఈ అక్రమ క్వారీ తవ్వకాలు పక్కనే జరుగుతున్న క్రషర్ నిర్వాహకుల ఆదేశాలతో, అనుచరులతో జరిగిందని ఆరోపించారు. ఈ అక్రమ తవ్వకాలపై ప్రశ్నించినందుకే మృతుడు చనిపోయాడని, ఇది ఎక్కడ భయటపడుతుందనే అనుమానంతో మృతదేహాన్ని సంఘటన స్థలం నుంచి మార్చి వేశారని అన్నారు. దీనిపై సమగ్రంగా దర్యాప్తు చేపట్టి నిగ్గు తేల్చకపోతే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, మేజర్ పంచాయతీ సర్పంచ్ రేగడి లక్ష్మి, వైసిపి పట్టణ అధ్యక్షుడు గాడు నాగరాజు, గుడ్ల మోహనరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ఒక్క ఛాన్స్ అంటూనే దెబ్బ


మహిళతో మాట్లాడుతున్న రవికుమార్

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

ఒక్క ఛాన్స్ అంటూ రాష్ట్ర ప్రజలు కోలుకోలేని దెబ్బను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తీశారని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. మండలంలోని చిన్నకాగితాపల్లిలో ఆదివారం ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి నిత్యవసరాల ధరలు, ఆర్‌టిసి, విద్యుత్ తదితర ఛార్జీల పెరుగుదల, ప్రస్తుత ప్రభుత్వ పనితీరు గురించి మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మద్యం, ఇసుక వంటి ఆదాయ వనరుల నుంచి వచ్చే సొమ్ము తాడేపల్లి ప్యాలెస్‌కు చేరుకుంటున్నదని దుయ్యబట్టారు. రహదారులు నరక కూపాలుగా మారి ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శివ్వాల సూర్యం, టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు అంబళ్ల రాంబాబు, మీసాల రామారావు, వెలమల రమేష్ పాల్గొన్నారు.

కొండలు, గుట్టలు మాయం

పలాస: నా తండ్రి గౌతు శ్యామ సుందర శివాజీ ఎమ్మెల్యే, మంత్రిగా పని చేసారని, ఏనాడూ అవినీతి చేయలేదని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. రాష్ట్ర మత్స్య, పశు సంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు పలాస నియోజకవర్గంలోని కొండలు, గుట్టలు, చెరువులు, వాగులు మాయం చేసి అవినీతి మంత్రిగా రాష్ట్రంలో పేరు సంపాధించుకున్నారని ఆమె ఆరోపించారు. మండలంలోని అల్లుకోల గ్రామంలో ఆదివారం 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గౌతు శిరీషకు టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గ్రామ పురవీధుల్లో పర్యటించి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ మంత్రి అప్పలరాజుతో పాటు ఆయన అనుచరులు పలాస నియోజకవర్గంలో నెమలికొండ, సూదికొండ, రామకృష్ణపురం, ఉజ్జిడి మెట్ట, నల్ల బొడ్డులూరు కొండలను ఆక్రమించి కంకర సైతం అమ్ముకుంటున్నారని ఆరోపించారు. తిరిగి టిడిపి నాయకులు భూకబ్జాలకు పాల్పడుతున్నారని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పి.విఠల్, గంగారాం, కుర్మారావు, పోలయ్య, బుర్లే రాజు, మోహనరావు, పాపారావు, యాధగిరి, నాయకరావు, పైల సూర్యనారాయణ, శాంతమ్మ, ధనుంజయ, విజయ్, అరియాపల్లి ప్రభుదాస్ పాల్గొన్నారు.



పలాస : అల్లుకోలలో పర్యటిస్తున్న గౌతు శిరీష


రాము మృతదేహం

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- లావేరు

కూలీ పని చేస్తే గాని పూటగడవని పరిస్థితి ఆ కుటుంబానిది. ఎప్పటి మాదిరిగానే కూలి పని నిమిత్తం తెల్లవారి జామున బయలుదేరి వెళ్లాడు. గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో శవమై లభించడంతో ఆ కుటుంబ సభ్యులు కన్నీమున్నీరుగా విలపిస్తున్నారు. మండలంలోని పెద్దరావుపల్లి సమీపంలో ఉన్న గెడ్డవాగు వద్ద మురపాకకు చెందిన గనమాన రాము (35) ముళ్లపొదల్లో అనుమానాస్పదస్థితిలో శవమై కనిపించాడు. పోలీసుల కథనం మేరకు... మురపాకకు చెందిన రాము అదపాకకు చెందిన మెస్త్రీ వద్ద కాంక్రీటు మిల్లర్ లిఫ్టింగ్ కూలీగా పనిచేస్తున్నాడు. రోజులానే మేస్త్రీ తగరపువలసలో పని ఉంది రావాలని ఫోను చేశారు. దీంతో రాము తన ద్విచక్ర వాహనంపై ఆదివారం తెల్లవారి జామున 4 గంటల సమయంలో పనికి వెళ్తున్నానని భార్యకు చెప్పి బయలుదేరాడు. తెల్లవారి సరికి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు తెలియడంతో సంఘటన స్థలానికి చేరుకుని బోరున విలపించారు. సమాచారం తెలుసుకున్న లావేరు ఎస్ఐ కోటేశ్వరరావు, హెచ్‌సి పి.రామారావు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు.

హత్యగా అనుమానిస్తున్న కుటుంబసభ్యులు

ప్రమాదం జరిగిన తీరు బట్టి చూస్తే తమ భర్తను హత్య చేసి గెడ్డవాగులో పడేశారని భార్య ఆరోపిస్తున్నారు. ద్విచక్రవాహనం ఒక దగ్గర.. మృతదేహం మరో దగ్గర ఉండడంతో పాటు మృతి ఒంటిపై గాయాలు ఉన్నాయని అన్నారు. దీనిబట్టి గ్రామస్థులు కుడా రామును చంపి ఉంటారని అనుమానిస్తున్నారు. సంఘటన స్థలాన్ని క్లూస్ టీం పరిశీలించారు. అనంతరం డిఎస్‌పి మహేంద్ర, సిఐ అదాం ఘటనా స్థలాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. మృతికి గల కారణాల వివరాలను త్వరితగతిన సేకరించాలని ఆదేశించారు. మృతుడి భార్య కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు. రాము మృతితో కుటుంబానికి పెద్ద దిక్కును కోల్పోయామని కుటుంబ సభ్యులు కన్నీమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడికి భార్య కుమారి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

క్రైమ్ కార్నర్



క్వారీ ప్రమాదంపై కేసు నమోదు

పొందూరు: మండలంలోని వి.ఆర్.గూడెం పరిధిలో అక్రమ గ్రావెల్ క్వారీ తవ్వకాల్లో జరిగిన సంఘటనపై శనివారం పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లక్ష్మణరావు ఆదివారం తెలిపారు. కొండపై అక్రమ గ్రావెల్ తవ్వకాలు, ప్రమాదం, ప్రమాద స్థలంలో మృతదేహాన్ని మార్చడం వంటి అంశాలపై వి.ఆర్.గూడెంకు చెందిన ఎస్.మధుసూదనరావు, లోలుగుకు చెందిన సిహెచ్.శ్రీనివాసరావుతో పాటు మరో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సీటు ఇప్పిస్తానంటూ మోసం

పొందూరు: సైనిక స్కూల్‌లో చదివిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని, రెండు సీట్లకు రూ.16ల క్షలు అవుతుందని వ్యక్తి నమ్మించాడు. దీంతో ఎలాగో డబ్బులు కూడబెట్టి అప్పగించాడు. తీరా సీటు రాకపోవడంతో ఇచ్చిన డబ్బులు అడిగేసరికి ఇవ్వనని బదులు ఇవ్వడంతో బాధితుడు మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మార్చి 31న బురిడికంచరాంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... విజయనగరం జిల్లా రాజాం మండలం పెనుబాకకు చెందిన బుడ్డేపు రామకృష్ణ తన ఇద్దరు కుమారులకు సైనిక స్కూల్‌లో సీట్లు ఇప్పిస్తానని పొందూరు మండలం బురిడికంచరాంకు చెందిన గులివిందల అసిరినాయుడు నమ్మబలికాడు. దీనికి రూ.16 లక్షలు అవుతుందని అసిరినాయుడు చెప్పడంతో 2020లో రామకృష్ణ ఆ మొత్తాన్ని ఇచ్చాడు. ఆ విద్యా సంవత్సరంలో సీటు రాకపోవడంతో డబ్బులు తీసుకున్న అసిరినాయుడును ప్రశ్నించి డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరాడు. మూడేళ్లు గడుస్తున్నా డబ్బులు ఇవ్వకపోవడంతో మార్చిన 31న అసిరినాయుడు ఇంటికి వెళ్లి డబ్బులు ఇవ్వాలని అడిగాడు. డబ్బులు ఇవ్వనని నీకు నచ్చిన వారితో చెప్పుకో అని అనడంతో మనస్తాపానికి గురయ్యాడు. తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే ఆయనను అక్కడి నుంచి శ్రీకాకుళం ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సను పొందుతున్నాడు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు.

టిడిపి మండల అధ్యక్షునిపై దాడి

పలాస : మండలంలోని రామకృష్ణాపురం జాతీయ రహదారిపై గురుదాసుపురానికి టిడిపి మండల అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణ్ కుమార్‌పై ఆదివారం సాయంత్రం ఇచ్ఛాపురం నియోజకవర్గానికి చెందిన వైసిపి నాయకులు నర్తు ప్రేమ్‌కుమార్, ఆయన అనుచరులు కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేశారు. క్షతగాత్రుడు, కాశీబుగ్గ పోలీసుల కథనం మేరకు... మండలంలోని రామకృష్ణాపురం జాతీయ రహదారిపై లక్ష్మణ్‌కుమార్ తన కారులో కూర్చుని ఉండగా ఆదివారం నాలుగు గంటల సమయంలో ఇచ్ఛాపురం నియోజకవర్గానికి చెందిన నర్తు ప్రేమ్ కుమార్ తన కారుతో ఎదురుగా వచ్చి ఢీకొట్టాడు. అక్కడితో ఆగకుండా కారులో ఉన్న ఇనుప రాడ్లు, కర్రలతో కారు అద్దాలను పగల కొట్టారు. అనంతరం కారులో కూర్చున్న లక్ష్మణ్ కుమార్‌ను బయటకు లాగి తన వద్ద ఉన్న ఇనుప రాడ్లతో, కర్రలతో దాడి చేశారు. అప్పటికి తప్పించేందుకు ప్రయత్నించినా చుట్టూ కాసి దాడి చేయడంతో కుడి కాలు విరిగి పోగా, ఒంటిపై తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, నాయకులు ఘటనా స్థలానికి చేరుకొని లక్ష్మణ్ కుమార్‌ను 108 వాహనంలో పలాస ప్రభుత్వా స్పత్రికిలో చేర్పించారు. జరిగిన ఘటనపై కాశీబుగ్గ డిఎస్‌పి శివరాంరెడ్డి దృష్టికి తీసుకెళ్లేందుకు శిరీష, శివాజీ ఫోన్ చేశారు. డిఎస్‌పి స్పందించకపోవడంతో చివరకు శివాజీ, శిరీష, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ డిఎస్‌పి కార్యాలయానికి చేరుకున్నారు. డిఎస్‌పికి ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించగా, ఇద్దరు మాత్రమే లోపలికి రావాలని చెప్పి తలుపు వేయాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. దీంతో శివాజీ స్పందిస్తూ తాను మీతో మాట్లాడుతుంటే అవమానించడం సరికాదని డిఎస్‌పితో వాగ్వాదానికి దిగారు. చివరకు డిఎస్‌పికి ఫిర్యాదు చేయకుండానే వెనుదిరిగారు. లక్ష్మణ్ కుమార్‌ను శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజనాసత్రికి తరలించారు. కాశీబుగ్గ ఎస్ఐ వి.రమేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దాడి అమానుషం

లక్ష్మణ్‌కుమార్‌పై వైసిపి నాయకుల దాడి అమానుషమని శిరీష, శివాజీ అన్నారు. టిడిపి నాయకుడు లక్ష్మణ్ కుమార్ భూకబ్జాకు పాల్పడినట్లయితే అధికారంలో నాలుగేళ్ల ఉండి ఏం చేశారని ప్రశ్నించారు. శ్రీధర్, అప్పలరాజు పలాస నియోజకవర్గంలో గొడవలు సృష్టిస్తున్నారని, కేవలం టిడిపి నాయకులపై దాడులు చేయడమే కాకుండా పోలీసులతో టిడిపి నాయకులపై కేసులు పెట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.


పరామర్శిస్తున్న శిరీష, శివాజీ

గ్రంథాలయాల్లో పుస్తక ప్రదర్శన



లావేరు : పుస్తకాలను ప్రదర్శిస్తున్న గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- లావేరు

ప్రతి విద్యార్థి పుస్తక ప్రదర్శనను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. మురపాక శాఖాగ్రంథాలయంలో ఆదివారం పుస్తకాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతినెలా మొదటి ఆదివారం గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహిస్తామని తెలిపారు. పుస్తకాలు ఇంటికి తీసుకువెళ్లడానికి విద్యార్థులు గ్రంథాలయంలో ధరావత్తు చెల్లించి తీసుకోవాలన్నారు. ఈ ప్రదర్శనలో చరిత్ర, సైన్స్, బాల సాహిత్యం తదితర పుస్తకాలను ప్రదర్శనలో ఉంచామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు జి.షణ్ముఖరావు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు. అలాగే లావేరు శాఖాగ్రంథాలయంలోనూ పుస్తక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

బలగ : బలగ శాఖాగ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించామని గ్రంథాలయాధికారి పి.ఉగ్రసేను తెలిపారు. ప్రతినెలా మొదటి ఆదివారం పుస్తక ప్రదర్శన నిర్వహిస్తామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ప్రదర్శనలో పిల్లలకు కావాల్సిన కథలు, తెలుగు నిఘంటువులు, ఇంగ్లీష్ నిఘంటువు, పద్యాలు, పోటీ పరీక్షలకు వెళ్లిన వారికి కాంపిటేషన్, టెక్స్ట్, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు, పెద్దలకు కోసం మహాభారత, రామాయణం పుస్తకాలను ప్రదర్శించామని తెలిపారు. కార్యక్రమంలో సహాయకులు కె.అనిత, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.



బలగ : పుస్తకాలను చదువుతున్న విద్యార్థులు

మండపం నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని బల్లిపుట్టుగలో లక్ష్మీనృసింహస్వామి దేవాలయ ప్రాంగణంలో మండపం నిర్మాణానికి ఆదివారం ఉదయం జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ శంకుస్థాపన చేశారు. రూ.5లక్షల జిల్లా పరిషత్ నిధులతో మండపం నిర్మిస్తున్నట్లు సర్పంచ్ శ్రీకన్య దొలాయి తెలిపారు. కార్యక్రమలో ఎమ్మెల్సీ నర్తు రామరావు, వైస్ ఎంపిపి పూడి నేతాజీ, ఎఎంసి వైస్ చైర్మన్ ఎలమంచి నీలయ్య, ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ రజనీ కుమార్ దొలై, పిఎసిఎస్ అధ్యక్షుడు దేవరాజు సాహు, కవిటి, గొనపపుట్టుగ సర్పంచులు పూడి లక్ష్మణరావు, బి.ప్రకాష్, జల్లు యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న విజయ



చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ఎంపీ, ఎమ్మెల్యే పరామర్శ

సంతబొమ్మాళి: మండలం లోని రుంకుహనుమంతుపురంలో ఇటీవల గుండెపోటుతో మాజీ సర్పంచ్, టిడిపి నాయకులు గోక ఆనందరావు మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపి కింజరాపు రామ్మోహనాయుడు మృతుడి కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ముందుగా ఆనందరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జీరు భీమారావు, పిట్ట రాజులు, గౌరినాయుడు, పోలాకి కృష్ణమూర్తి, దుపాన రమణారెడ్డి పాల్గొన్నారు.

సమాజ అభ్యుదయానికి సాహిత్యం అవసరం



మాట్లాడుతున్న చంద్రశేఖర్

ప్రజాశక్తి- పొందూరు

సమాజ అభ్యుదయానికి, నిత్యజీవితంలో భాషా సంస్కృతులు కొనసాగడానికి సాహిత్యం అవసరమని జనసాహితి జిల్లా శాఖ అధ్యక్షులు, ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి అన్నారు. పొందూరు ఎపిటిఎఫ్ రాక్ష్మి కౌన్సిలర్ కె.విజయ్‌కుమార్ అధ్యక్షతన ఆదివారం జనసాహితి ప్రాంతీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులతో, ఉపాధ్యాయులతో పాటు సమాజ అభ్యుదయాన్ని కాంక్షించే వారందరూ ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న విషయాలపై చర్చించాలన్నారు. అనంతరం ప్రజల్లో అవగాహన పెంచడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో భాషా పరిశోధకలు, విశ్రాంత అధ్యాపకులు ఎ.చంద్రశేఖర్, ఎపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి చావలి శ్రీనివాస్, వి.నవీన్‌కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ సదాశివుని శంకరరావు, పైడి శ్రీరామ్మూర్తి, పొందూరు మండల శాఖ అధ్యక్షులు ఎం.రమణారావు, ఎపిటిఎఫ్ సీనియర్ నాయకులు పి.తిరుమలరావు, జి.జవహారగుప్తా, కె.వెంకట రావు, ఎన్.భోగిరాజు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

అంబేద్కర్ విగ్రహావిష్కరణ

కొత్తూరు : డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ దేశానికి మార్గదర్శకులని, ఆయన ఆశయాలను ప్రతిఒక్కరూ కొనసాగించాలని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని కర్లెమ్మ పంచాయతీ మహసింగి దళితవాడ అంగన్వాడీ కేంద్రం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువకులు ఆంబేద్కర్ స్ఫూర్తిని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, ఎంపిటిసి ప్రతినిధి గోగుల వరప్రసాదరావు నాయుడు, వైసిపి నాయకులు బి.శ్రీను, పిన్నింటి రామారావు నాయుడు, కె.త్రినాథరావు, పసుపురెడ్డి వెంకటరావు, అశోక్ కుమార్, గుడివాడ రామారావు, పంకాజ్ దాస్ పాల్గొన్నారు.

9న రైల్వే గేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలో ఎల్‌సిగేటు వద్ద రహదారి దాటేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సబ్‌వే ఏర్పాటు చేయాలని కోరుతూ ఈ నెల 9న ధర్నా చేయనున్నట్లు జనసేన పార్టీ ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు తెలిపారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్య సమరయోధుడు పుల్లెల శ్యామసుందరరావు పేర ఈ నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. రైళ్ల రాకపోకల సమయంలో ఎస్‌ఎల్‌సి గేటు వేయడం వల్ల గంటల తరబడి ట్రాఫిక్ స్తంభిస్తోందని చెప్పారు. ఈ విషయమై ఫిబ్రవరి 6న జనసేన పార్టీ తరపున రైల్వే అధికారులకు వినతిపత్రం ఇచ్చామని తెలిపారు. వారి నుంచి స్పందన లేకపోవడంతో ప్రత్యక్ష కార్యాచరణకు దిగినట్లు చెప్పారు. ఉదయం 9.30 నుంచి 11.30 వరకు గేటు వద్ద శాంతియుతంగా చేపట్టే నిరసనలో ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఆయనతో పాటు జనసేన రాష్ట్ర మత్స్యకార వికాస విభాగ కార్యదర్శి నాగుల హరి బెహరా, జనసేన రాష్ట్ర జాయింట్ సెక్రటరీలు తిప్పన దుర్యోధనరెడ్డి, బైపల్లి ఈశ్వరరావు, జన సైనికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దాసరి రాజు



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి రాజు

200 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం మండలం సనపలవానిపేటలో సన్‌రైజ్ ఆస్పత్రి ఆధ్వర్యాన ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు ఈ శిబిరంలో 200 మందికి వైద్యాధికారి రాజు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రధానంగా షుగర్, బిపి, ఇతర దీర్ఘకాలిక రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ శిబిరంలో సన్‌రైజ్ ఆస్పత్రి సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- పాలకొండ రూరల్

ఉత్తరాంధ్ర అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని గ్రాడ్యూటీ ఎంఎల్‌సి వేపాడ చిరంజీవి అన్నారు. ఆదివారం స్థానిక ఎలైట్ కళాశాలలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను గెలిచిన వెంటనే గ్రూపు -2 నోటిఫికేషన్ విడుదల చేయాలని వినతిపత్రం అందజేశానని, అందుకు ప్రభుత్వం కూడా అంగీకరించిందన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. నిరుద్యోగులు, ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారం కోసం తాను నిరంతరం పాటు పడతానన్నారు. శాసనమండలిలో ఈ ప్రాంత అభివృద్ధి కోసం మాట్లాడుతానన్నారు. ఆయనతో పాటు ఎంఇఒ సూర్యనారాయణ, విశ్రాంత లైబ్రేరియన్ చౌదరినాయుడు, ఎపిటిఎఫ్ నాయకులు సంపత్, వాసుదేవరావు, పద్మజ తదితరులున్నారు.

సొండిలను ఒబిసిలో చేర్చాలి

ప్రజాశక్తి- టెక్కలి

రాష్ట్రంలో ఉన్న సొండిలను ఒబిసి జాబితాలో చేర్చాలని సోండికుల సంఘ రాష్ట్ర అధ్యక్షులు రత్నాల కాశీవిశ్వనాథ చౌదరి డిమాండ్ చేశారు. ఆదివారం టెక్కలిలో ఆ సంఘ కార్యాలయ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 50వేలకుపైగా జనాభా కలిగిన సొండి కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం మాదిరిగా సారాయి వేలం పాటల్లో ప్రత్యేక రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తూ రాయితీ ప్రకటించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెహరా రాజారావు, ఉపాధ్యక్షులు ఉత్తర కవాటం గణపతిరావు, ఎల్లారావు, నాగభూషణం, రత్నాల శ్రీనివాస్, డాక్టర్ గిరిబాబు, ఆర్‌వి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న నాయకులు



చెరుకు కనుపలను నాటడానికి సిద్ధం చేస్తున్న రైతులు

విత్తన శుద్ధితో తెగుళ్ల నుంచి రక్షణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని చేపేనపేటలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నక్క చిరంజీవి రైతుల చేత చెరుకు కనుపులను బీజామృతంలో విత్తన శుద్ధి చేయించి నాటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజామృతంతో విత్తనాలను విత్తన శుద్ధి చేసుకుని వేసుకోవడంతో నేలలో నుంచి సంక్రమించే తెగుళ్ల బారి నుంచి విత్తనాలకు రక్షణ ఉంటుందన్నారు. విత్తనం పురుగులు, తెగుళ్లను తట్టుకునే సామర్థ్యం ఉంటుందని తెలిపారు. ప్రకృతి సాగులో మొదట ఏ పంట విత్తనమైనా ముందుగా బీజామృతంలో విత్తన శుద్ధి తప్పకుండా చేసుకోవాలని రైతులకు వివరించారు. కార్యక్రమంలో తిరుపతి, జానికిరాం పాల్గొన్నారు.



విద్యార్థులకు స్టేషనరీ అందిస్తున్న సిమ్మన్న

విద్యార్థులకు స్టేషనరీ వితరణ

సంతబొమ్మాళి : పదో తరగతి విద్యార్థులకు వడ్డివాడ జెడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పొట్నూరు శ్రీనివాసరావు ఆధ్వర్యాన ఎఫ్‌సిఐ ఉద్యోగి ఎన్.సిమ్మన్న స్టేషనరీని ఆదివారం అందజేశారు. సోమవారం నుంచి పదో తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు కావాల్సిన ప్లాంక్, స్కేలు, పెన్సిల్, పెన్నులు, హాల్ టిక్కెట్ కవర్ అందించారు. సిమ్మన్న మాట్లాడుతూ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని కోరారు. దాతల సహకారం విద్యార్థులకు అవసరమని హెచ్‌ఎం అన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేశవదాసుపురంలో 'జనం కోసం జనసేన'

పొందూరు: మండలంలోని కేశవదాసుపురంలో జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు ఆధ్వర్యాన ఆదివారం జనం కోసం జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి జనసేన పార్టీ సిద్ధాంతాలు, షణ్ముక వ్యూహం, కౌలు రైతులకు అండగా నిలవడం వంటి పలు విషయాలను ప్రజలకు వివరించారు. ఈయనతో పాటు జనసేన పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న జనసేన నాయకులు